
# హలో...హలో.. ఓ అమ్మాయి!



'ప్రియదత్త' వారపత్రిక . . . 28 జూలై, 2004

"హలో..."

"హలో దేవదాసు రాసిన శరత్‌గారేనా?"

"దేవదాసు కాని శరత్‌ని!"

"నమస్తే! నేను మీరున్న బిల్డింగ్‌లోనే ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాను. మా అమ్మా నాన్నలకు ఏకైక కుమార్తెను."

"అందుకు నేనేం చేయగలను? మిమ్మల్ని ఏకైక కుమార్తె కాకుండా చేయగలిగే శక్తి మీ అమ్మానాన్నలకే ఉంది."

"జోక్ బాగుంది. నేను ఫోన్ చేసింది- ఆ విషయం కనుక్కోవడానికి కాదు. మీ విషయం కనుక్కోవడానికి!"

"నా విషయం మీకెందుకు?"

"మీకు పెళ్ళి అయిందని నేనూ, కాలేదని నా స్నేహితురాలూ వంద రూపాయలు పందెం వేసుకున్నాం. మాలో ఎవరు గెలిచారో మీరే చెప్పాలి!"

"మీరు మీ అమూల్యమైన సమయాన్నీ, ధనాన్నీ వ్యర్థం చేస్తున్నారని బాధగా వుంది."

"ఈ సమాధానం నాకు నచ్చింది. ధనాన్ని అన్నారు కాబట్టి మీకు పెళ్ళి కాలేదని అర్థమైంది. ఈ విషయం నాకు మరింత నచ్చింది."

"ఇంతకీ ఎవరు మీరు?"

"వెన్నెల్లో ఆడపిల్లని!"

"మీరు ఏ పిల్లయినా నాకు ఎందుకు ఫోన్ చేశారో చెప్పండి?!"

"నిన్న పార్టీ ఎలా జరిగింది?"

"ఏ పార్టీ..?"

"టౌన్లో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో మీ బ్యాంకు జట్టు గెలుపొందిన సందర్భంగా మీరు చేసుకున్న పార్టీ!"

"ఆ విషయం మీకెలా తెలుసు?"

"గోడలకు చెవులుంటాయి."

"ఆ పార్టీలో గోడలే లేవు. బాల్కనీలో జరుపుకున్నాం."

"పార్టీలో మీరు కూడా తాగారా?"

"ఛ..ఛ... నాకా అలవాటు లేదు."

"ఈ కాలం కుర్రాళ్ళు అదో క్వాలిఫికేషన్ అనుకుంటారుగా! నిజం చెప్పండి... నేనేం అనుకోను."

"అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. నాకు త్రాగుడంటే అసహ్యం!"

"ఎందుకు?"

ఒక్క క్షణం తటపటాయించి చెప్పాడు-

"మా నాన్న ప్రతిరోజూ తాగి ఇంటికొచ్చేవాడు. ఆయన తాగుడు వల్ల మా అమ్మ ఎంతో బాధపడింది, ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. ఆమెతో పాటు మేమూ ఆ బాధ భరించాము.

అప్పుడే మద్యం ముట్టకూడదని నిశ్చయించుకున్నాను. నా అలవాటు వల్ల రేపు నా భార్యాపిల్లలు బాధపడకూడదు. తాగడంలో ఆనందం ఉందో, లేదో నాకు తెలియదు. కానీ, ఒకరిని బాధపెట్టే ఆనందం నాకు అక్కర్లేదు."

"చాలా చక్కగా చెప్పారు. మిమ్మల్ని చేసుకోబోయే అమ్మాయి చాలా అదృష్టవంతురాలు."

"ఇంతకీ... మీరు నాకు ఎందుకు ఫోన్ చేశారో చెప్పలేదు?"

"మీతో మాట్లాడదామని!"

"నాతో మాట్లాడితే మీకేం లాభం?"

"ఓ మంచివ్యక్తితో పరిచయం కలుగుతుంది కనుక!"

"నేను మంచివాణ్ణని ఎలా చెప్పగలరు?"

"నేను చూశాను కాబట్టి!"

"ఎప్పుడు?"

"ఒకరోజు నేను స్కూటీపై వస్తుంటే మీరు మోటార్ బైక్ మీద ఎదురొచ్చారు. ఒకప్రక్క ట్రాక్టర్, మరోప్రక్క అంబాసిడర్ కారు నిలబడివున్నాయి. ఆ చిన్నవీధిలో, ఆ వాహనాల మధ్య ఉన్న కొద్దిస్థలంలో మనం ఎదురుపడ్డాము. ముందు మీరే వచ్చినా- నేను చూసుకోకుండా కొంతదూరం వచ్చేశాను. మీరు వీలైనంత ప్రక్కకు జరిగి నాకు ట్రాక్టర్ తగలకుండా దారి ఇచ్చారు. ఈ కాలంలో అందరూ ఫాస్ట్! ఇంకో మనిషి గురించి ఆలోచించే ఓపికా, తీరికా ఎవరికీ ఉండవు. కానీ, మీరు ఎదుటి మనిషి క్షేమం గురించి అంత కన్సర్న్ చూపడం నాకు ఆశ్చర్యం కలిగించింది. మీరు అందరిలాంటివారు కారని నాకు అనిపించింది. అందుకే మీకు థాంక్స్ చెబుదామని ఫోన్ చేశాను."

శరత్‌కీ గుర్తొచ్చింది ఆ సన్నివేశం! అయితే... ఆ అమ్మాయికి ట్రాక్టర్ తగలకూడదని తను వీలైనంత ప్రక్కకు జరిగే ప్రయత్నంలో ఆమె ముఖం సరిగ్గా చూడలేదు. ఇప్పుడు ప్రయత్నించినా గుర్తురాలేదు అతనికి.

"మీ రూపం నాకు గుర్తురావడం లేదు. ఎప్పుడు కనిపిస్తారు మళ్లీ?"

"అపురూపమైనవి అంత సులభంగా కనపడకూడదు. ఉంటాను... మళ్లీ రేపు ఇదే సమయానికి ఫోన్ చేస్తాను. బై!"

●

ఆ అమ్మాయి శరత్‌కి రోజూ ఫోన్ చేస్తూ అతనితో పరిచయం పెంచుకుంది.

అయితే... అతనికి తన పేరూ, ఫోన్ నంబరూ చెప్పలేదు. శరత్‌కి రోజూ బ్యాంకు నుంచి రాగానే ఆ అమ్మాయి ఫోన్ కోసం ఎదురుచూడటం అతని దినచర్యగా మారింది.

ఒకరోజు ఫోనులో మాట్లాడుతూ "మీకు పెళ్ళయిందా?" అని అడిగాడు.

"లేదు..."

"ఎలాంటి భర్త కావాలనుకుంటున్నారు మీరు?"

"అతనికి కొన్ని ప్రత్యేకతలుండాలి. సంగీతంలోనో, సాహిత్యంలోనో, స్పోర్ట్స్‌లోనో ప్రవేశముండాలి. ఉదయం లేచి ఆఫీసు కెళ్లి, సాయంత్రం అలసిపోయి వచ్చి, టీవీ చూసి పడుకొనే భర్త

నాకు వద్దు. ఏదో ఒక వ్యాపకంతో అతను బిజీగా ఉండాలి. ఒకవేళ ఎందులోనూ ప్రవేశం లేకపోయినా కనీసం పదిమందికి మంచి చేస్తూ, మంచి చెబుతూ ఉండాలి."

"మీ అభిరుచులకు తగిన భర్త దొరకాలని కోరుకుంటున్నాను."

"థాంక్యూ..."

"మీరేం చేస్తున్నారు?"

"మీతో ఫోనులో మాట్లాడుతున్నాను."

"నేను అడిగింది మీ ఉద్యోగం గురించి!"

"నేను మొన్నే ఎం.ఎస్.సి. ఫిజిక్స్ పాసయ్యాను. యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాను. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పాసయ్యాను. ఫైనల్‌కి ప్రిపేర్ అవుతున్నాను."

"యు ఆర్ గ్రేట్! యు విల్ కమ్ అవుట్ సక్సెస్‌ఫుల్లీ ఇన్ ఫైనల్ ఆల్సో!"

"థాంక్యూ..."

"ఇంతకీ... మీ పేరేమిటో చెప్పలేదు?"

"కనుక్కోండి చూద్దాం!"

"క్లూ ఏదైనా ఇవ్వండి!"

"నాది అచ్చమైన తెలుగు పేరు. మా నాన్నగారికి సాహిత్యం మీద ఉన్న అభిమానంతో నాకా పేరు పెట్టారు"

"సాహితి!"

"కాదు. ఈ కాలం కుర్రాళ్ళ ఊహకి అందనిది నా పేరు. దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి వాళ్ళకే సాధ్యం అది!"

"నాకు తెలిసింది మీ పేరు!"

"చెప్పండి..."

- ఎగ్జయిట్‌మెంట్ ధ్వనించింది ఆమె కంఠంలో.

"భావన!"

"బాప్‌రేఁ... చాలా ఫాస్ట్ మీరు! కంగ్రాట్స్... ఎలా కనుక్కున్నారు?"

"దేవులపల్లిని భావకవి అంటారు కదా! మీరు ఆయన పేరు చెప్పడం వెనుక ఈ భావం ఉన్నదని అర్థమైంది. గెలిచినందుకు ఏమిస్తారు నాకు?"

"ఏం కావాలి మీకు?"

"ఒక ఇన్‌టాంజిబుల్ ఐటమ్ నాకు బహుమతిగా కావాలి."

"అర్థమైంది. అలా అడగగానే ఇచ్చేయడానికి ఇది స్కూటీయో, టేప్‌రికార్డరో కాదు కదా! అవతలివ్యక్తి గురించి పూర్తిగా తెలిశాకే ఇవ్వాలి."

"తెలుసుకునే ఇవ్వండి!"

"సరే... మీ హాబీస్ ఏమిటి?"

"నాకు సంగీతమన్నా, సాహిత్యమన్నా, స్పోర్ట్స్ అన్నా చాలా ఇష్టం! బ్యాంకు వదిలాక ఈ ముగ్గురు స్నేహితులతో కాలం గడుపుతాను."

"వీటిల్లో మీకు ప్రవేశం కూడా ఉందా? ఒట్టి ఆసక్తేనా?"

"సంగీతం నేను నేర్చుకోలేదు గానీ- చక్కగా పాడతాను. స్కూల్లో, కాలేజీల్లో బహుమతులు గెలుచుకున్నాను. ఇక సాహిత్యంలో ఇప్పటిదాకా పది కవితలు, పాతిక కథలు అచ్చయ్యాయి. క్రికెట్, చెస్, కేరమ్స్ బాగా ఆడతాను. టౌన్లో మంచి కంసిస్టెంట్ బ్యాట్స్‌మన్‌గా, లెగ్‌స్పిన్నర్‌గా పేరుంది."

"మీరు నిజంగా గొప్పవారు. ఒక వ్యక్తికి ఇన్ని రంగాల్లో ప్రవేశం, ప్రావీణ్యం ఉండటం గ్రేట్!"

"ఇదే నన్ను ఎదగనీయకుండా చేసింది!"

"అదేం..?"

"చిన్నప్పట్నుంచీ ఒక్క క్రికెట్ పైనే కాన్సన్‌ట్రేట్ చేసివుంటే ఓ టెండూల్కరో, అనిల్ కుంబ్లేనో అయి ఉండేవాణ్ణి. సంగీతంలో మాత్రమే కృషి చేసి ఉంటే ఓ ఘంటసాల, ఓ బాలు అయి ఉండేవాణ్ణి. రచనల్లో మాత్రమే కృషి చేసి ఉంటే ఓ యండమూరి, ఓ మల్లాది అయి ఉండేవాణ్ణి. చెస్‌పై పూర్తిగా మనసుపెట్టి ఉన్నా ఓ విశ్వనాథన్ ఆనంద్ అయి ఉండేవాడిని. ఇప్పుడు ఏ గుర్తింపూ లేక టౌను లెవెల్‌కు మించి ఎదగలేకపోయాను" బాధగా అన్నాడు.

"అలా ఎందుకనుకుంటారు? టెండూల్కర్ మీలా కథలు రాయలేదు. బాలు మీలా క్రికెట్ ఆడలేదు. విశ్వనాథన్ ఆనంద్ మీ అంత శ్రావ్యంగా పాడగలడో, లేడో?! కాబట్టి ఇన్ని రంగాల్లో ప్రావీణ్యం ఉన్న మీరే గొప్పవారు."

"మీరు నామీద ఇష్టంతో అలా అంటున్నారు గానీ, నేను చాలా సామాన్యుణ్ణి... ఇప్పుడిప్పుడే ఎదగడానికి ప్రయత్నిస్తున్నవాణ్ణి!"

"ఓ కళాకారుడికి గానీ, క్రీడాకారునికి గానీ అహంకారం, గర్వం ఉండకూడదు. అవి ఉంటే అతను ఎదగలేడు. మీలో అణకువ ఉంది. కాబట్టి మీరూ ఏదో ఒకనాటికి ఎంతో ఎత్తుకు ఎదుగుతారని నా నమ్మకం!"

"నామీద మీకున్న నమ్మకానికి థాంక్స్! ఇంతకీ మనం ఎప్పుడు కలుసుకోబోతున్నాం?" శరత్ అడిగాడు కుతూహలంగా.

"ఆల్‌రెడీ మనం ఒకసారి కలిశాం... మీరే నన్ను చూడలేదు. రెండో అవకాశం రేపు సాయంత్రం వస్తుంది."

"ఎలా?"

"ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న పట్టాభిగారు తన కుమార్తె పెళ్ళి కుదిరిన సందర్భంగా ఫ్లాట్స్‌లో ఉన్న అందరికీ మన బిల్డింగ్ వెనుక ఉన్న ఖాళీస్థలంలో డిన్నర్ పార్టీ ఇస్తున్నారు. సో... నేను మీకు అక్కడ కనిపిస్తాను. అయితే భావన ఎవరని మీరు ఎవర్నీ అడగకూడదు. మీరే కనుక్కోవాలి."

"అలాగే..." ఉత్సాహంగా అన్నాడు శరత్.

"ఆల్ ద బెస్ట్... బై!"

●

పార్టీలో శరత్‌కి వయసులో ఉన్న అమ్మాయిలు ఐదుగురే కనిపించారు. అందర్లోకి అందమైన అమ్మాయి దగ్గరికి వెళ్లి "హలో భావనా!" అన్నాడు.

"సారీ... నా పేరు స్నేహ!" అంది ఆ అమ్మాయి.

"సారీ!" అన్నాడు శరత్. ఆమెని 'భావన ఎక్కడ?' అని అడగాలనుకున్నాడు. అయితే అలా చేయనని భావనకి మాట ఇచ్చినందువల్ల ఆ ప్రయత్నం మానుకున్నాడు. మిగిలిన నలుగురు అమ్మాయిల్నీ దగ్గరగా చూస్తూ, ఎవరైనా పిలిస్తే ఆ పేర్లు నోట్ చేసుకుంటూ గడిపాడు. పార్టీ సగంలోనే ఆ అమ్మాయిల్లో భావన లేదని అతనికి తెలిసిపోయింది. అతనికి భావన మీద కోపం కూడా వచ్చింది- తనకు కనబడకుండా దాగుడుమూతలు ఆడుతున్నందుకు.

ఆరాత్రి అతనికి ఫోన్ వచ్చింది... భావన దగ్గర్నుంచి.

"మీరు మాట తప్పారు!" అన్నాడు శరత్ నిష్ఠూరంగా.

"ఆ పని నాకు ఊహ తెలిసినప్పటినుంచీ నేను చెయ్యలేదు."

"మరి, పార్టీకి రాలేదేం?"

"వచ్చాను... మిమ్మల్ని చూశాను. మీరు బ్రౌన్‌కలర్ పేంట్ మీద క్రీమ్‌కలర్ జుబ్బా ధరించి వచ్చారు. ఈరోజు మీరు ఎప్పటికంటే అందంగా కనిపించారు. నన్ను కనిపెట్టే ప్రయత్నంలో ఆ అమ్మాయిల చుట్టూ తిరగడం చూసి నాకు భలే నవ్వొచ్చింది."

"మీరు మారువేషంలో వచ్చారా?" అనుమానంగా అడిగాడు.

"లేదు."

"కొంపదీసి మీరు నలభై ఏళ్ల ప్రౌఢ కాదుకదా..?"

"కాదు!" అంటూ నవ్వింది.

"మరి, మిమ్మల్ని నేను ఎలా మిస్ అయ్యాను?"

"ఆ విషయం మీ మిసెస్ అయ్యాక చెబుతాను. ఏం చేస్తున్నారు ఇప్పుడు?"

"ఓ వారపత్రిక నవలల పోటీ అనౌన్స్ చేసింది. అందుకోసం నవలకు ప్లాటు ఆలోచిస్తున్నాను. అయితే నవల రాయడం అంత సులభం కాదు. పేజీలకొద్దీ రాయాలి. అంత ఓపిక, టైము నాకు లేదు. పైగా, ఈ నెలాఖరులోగా పంపాలి. ఇరవై రోజుల్లో నూటయాభై పేజీలు రాయడం ఇంపాజిబుల్!"

"వేర్ దేర్ ఈజ్ ఎ విల్- దేర్ ఈజ్ ఎ వే! యు కెన్ డూ యిట్! ఈరోజు నుండే ప్రారంభించండి."

"ప్రయత్నిస్తాను..."

"ప్రయత్నించడం కాదు- పట్టుదలతో రాయాలి. ఇంకా ఇరవై రోజుల టైముందని అన్నారుగా! రోజుకు పదిహేను పేజీలు రాసినా పదిరోజులకు నూటయాభై పేజీలు పూర్తవుతుంది. ఆ తర్వాత మార్పులు, చేర్పులకు రెండురోజులు. తర్వాత ఫెయిర్ చెయ్యడం!"

"సరే... ఈరోజు నుంచి ఆ పని మీదే ఉంటాను."

"కార్యసాధకు లెప్పుడూ ఆశావాదులుగానే ఉండాలి. గుర్తుంచుకోండి!"

"గుర్తుంచుకుంటాను... బై!"

●

పదిహేను రోజుల తర్వాత భావన శరత్‌కి ఫోన్ చేసింది.

"అబ్బ... ఎన్నాళ్లకు విన్నాను మీ వాయిస్? ఏమయ్యారు ఇన్నాళ్లూ..?"

"మిమ్మల్ని డిస్టర్బ్ చేయకూడదని ఫోన్ చెయ్యలేదు. నవల పూర్తయిందా?"

"అయింది. ఫెయిర్ కూడా చేసేశాను" ఆనందంగా చెప్పాడు శరత్.

"నేను చెప్పానా- మీరు రాయగలరని! నాకు ఆ నవల చదవాలని ఉంది. నాకు అందజెయ్యగలరా?"

"తప్పకుండా! మీ ఇంటికి తీసుకురానా?"

"ఆశ! నేను ఇంకో ఐదు నిమిషాల్లో మీ ఇంటికి వస్తాను. మీరు నవలని ఓ సంచిలో పెట్టి మీ మెయిన్‌డోర్ హేండిల్‌కి తగిలించి వెళ్లిపొండి. నేను వచ్చి నవలను తీసుకుంటాను. మరో ఐదు నిమిషాల తరువాత మీరు మీ ఇంటికి వచ్చెయ్యవచ్చు. అయితే మీరు ఎక్కడా దాక్కుని నన్ను చూసే ప్రయత్నం చెయ్యకూడదు..."

"అలాగే!"

అయిదు నిమిషాలు బయట తిరిగి ఫ్లాటుకు వచ్చిన శరత్‌కు తలుపుకు అతికించబడి ఉన్న ఓ కాగితం కనిపించింది.

అందమైన చేతివ్రాతతో ఉన్న ఆ కాగితాన్ని చదివాడు...

"నవల తీసుకున్నాను. రేపు ఉదయం మీరు జాగింగ్‌కి వెళ్లివచ్చేసరికి మీ తలుపు గొళ్లానికి సంచి, సంచిలో నవల ఉంటుంది" అని రాసి ఉంది.

మరుసటిరోజు జాగింగ్‌కి వెళ్లివచ్చేసరికి తలుపుకి సంచి వేలాడుతోంది. లోపల నవలతో పాటు ఓ స్లిప్పు కనిపించింది. తీసి చదివాడు...

"నవల అద్భుతంగా ఉంది. మంచి రచయితకు ఉండే లక్షణాలు మీకున్నాయి... ఒక్కటి తప్పు! అది మీపై మీకు నమ్మకం! దాన్ని పెంచుకోండి గొప్ప రచయిత అవుతారు!" అని రాసివుంది.

నవలను పోటీకి పంపాడు.

నెలరోజుల తరువాత మొదటి బహుమతి వచ్చిందని ఉత్తరం వచ్చింది.

శరత్‌కి ఎంతో ఆనందం కలిగింది. ఆ ఆనందాన్ని భావనతో పంచుకోవాలని ఆమె ఫోన్ కాల్ కోసం ఎదురుచూడసాగాడు. అప్పటికే ఆమె ఫోన్ చేసి నాలుగు రోజులయింది. సాయంత్రం ఎక్కడికీ వెళ్లకుండా ఫోను ప్రక్కనే కూర్చున్నాడు.

ఆరోజు కూడా భావన ఫోన్ చెయ్యలేదు.

మరో రెండ్రోజుల తర్వాత ఫోన్ మోగితే ఆత్రంగా వెళ్లి రిసీవర్ అందుకున్నాడు.

"హలో..." అన్నాడు ఆత్రంగా.

"హలో శరత్‌గారూ... ఎలా ఉన్నారు?"

భావన గొంతు విన్న అతనికి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

"ఏమయ్యారు ఇన్నిరోజులూ? నేనెంత నరకం అనుభవించానో తెలుసా?"

"అయామ్ సారీ... నేను ఊళ్లో లేను. అందుకే మీకు ఫోన్ చెయ్యలేదు."

"ఈరోజుల్లో పల్లెటూళ్లకు కూడా ఫోను సౌకర్యం ఉంది. నాకు ఫోన్ చెయ్యాలని ఒక్కసారి కూడా మీకు అనిపించలేదా?" బాధగా అన్నాడు.

"ఆ విషయం తరువాత చెబుతాను. మీకో గుడ్‌న్యూస్... మనం ఈరోజు కలవబోతున్నాం!"

"నిజంగా..? ఎప్పుడు? ఎక్కడ?" ఎగ్జయిట్‌మెంట్ ధ్వనించింది అతని కంఠంలో.

"ఈరోజు సాయంత్రం... హోటల్ అభిలాష్‌లో!"

"నేను మీకోసం ఎదురుచూస్తూ, అక్కడికి వచ్చిన ప్రతి అమ్మాయినీ చూస్తుంటే మీరు ఏ మూలో కూర్చుని నవ్వుకుంటూ ఉంటారు... అవునా?"

"లేదు. అక్కడ లాన్‌లో టేబుల్ నెంబర్ సెవెన్ మనకోసం రిజర్వ్ చేయించాను. ఆరు గంటలకు మీరు అక్కడికి రండి. నేను మీకోసం ఎదురుచూస్తూ ఉంటాను."

"నమ్మమంటారా?"

"మీకు అనుమానమే అక్కర్లేదు."

"సరే! మీకొక గుడ్‌న్యూస్... నా నవలకు మొదటి బహుమతి వచ్చింది."

"ఓహ్ఁ... కంగ్రాట్స్! యు హేవ్ డన్ ఇట్!! ఇక శరత్ ప్రఖ్యాత రచయిత కాబోతున్నా రన్నమాట!"

"ఈ విజయం వెనుక మీరున్నారు. మీ స్ఫూర్తితోనే దీన్ని సాధించగలిగాను."

"ఓ.కె. వి విల్ సెలబ్రేట్ ఇట్ ఇన్ ది ఈవినింగ్... బై!"

●

ఎగ్జయిట్‌మెంట్‌తో అతనికి ఏం చేయాలో తోచలేదు.

ఐదు వరకు భావన గురించిన ఆలోచనలతో గడిపాడు. తర్వాత లేచి మంచి డ్రెస్ వేసుకున్నాడు. టై కట్టుకున్నాడు. మోటార్‌బైక్ తీసి బయలుదేరాడు. ఆరు గంటలకు బైక్ హోటల్ ముందు పార్క్ చేసి లోపలికి నడిచాడు. హోటల్‌లో ఓ ప్రక్కగా ఉన్న లాన్‌లో టేబుల్స్ ఉన్నాయి. వాటి నెంబర్లు చూసుకుంటూ ఏడవ నంబరు టేబుల్ దగ్గర ఆగాడు.

ఆ టేబుల్ ముందు కూర్చొనివుంద ఓ అద్భుతమైన సౌందర్యరాశి. తెల్లచీర, తెల్ల రవిక, తలనిండా మల్లెపూలతో పెళ్ళికూతురులా ఉంది. కూర్చొనివున్నా మంచి పొడగరి అని తెలుస్తూ ఉంది. చురుకైన కళ్ళు, కోటేరు ముక్కు, అన్నిటినీ మించి ఆహ్లాదపరిచే చిరునవ్వు అతన్ని ఎంతో ఆకట్టుకుంది.

"మిస్ భావన?" ఆమె వైపు చూస్తూ అడిగాడు.

"యస్ మిస్టర్ శరత్! గ్లాడ్ టు మీట్ యు!" ఆమె కూర్చునే చేయి అందించింది.

శరత్ చేయి కలిపాడు. మెత్తగా తగుల్తున్న ఆమె చేతులు అతని మనసుని గిలిగింతలు పెట్టాయి.

"కూర్చోండి..." అంది భావన.

ఎదురుగా కాకుండా ఆమె ప్రక్కనే కూర్చున్నాడు... ఆమెని మరింత దగ్గరగా చూడొచ్చని!

"ఏం తీసుకుంటారు?" భావన అడిగింది- వెయిటర్ దగ్గరికి రాగానే.

"ఏదైనా... లైట్‌గా తీసుకుందాం!" అంటూ తనే రెండు ఐటమ్స్ ఆర్డరిచ్చాడు శరత్.

"నేను మిమ్మల్ని ఇంత త్వరగా చూస్తానని అనుకోలేదు" అన్నాడు.

"నేను మీకు నచ్చానా?"

"నచ్చారు... నేను అదృష్టవంతుణ్ణి!"

కొద్దిసేపు ఒకరినొకరు చూసుకుంటూ ఉండిపోయారు.

"ఏదైనా మాట్లాడండీ..." అన్నాడు శరత్.

"నేను ఎం.ఎస్.సి. ఫిజిక్స్ పూర్తిచేసిన తర్వాత ఈ ఊరికొచ్చాము. మా నాన్న మంచిపేరున్న కంపెనీకి జనరల్ మేనేజర్. ఓరోజు మన ఫ్లాట్స్‌లో ఉండే నా స్నేహితురాలు మిమ్మల్ని చూపించి మీరు స్టేట్‌బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్ అని చెప్పింది. ఆ పరీక్ష పాసవడం చాలా కష్టం కాబట్టి మీరు చాలా తెలివితేటలు కలవారని నాకు అర్థమైంది. ఆ తర్వాత రోడ్డుపై మీరు నాకు దారి ఇచ్చిన సంఘటన నన్ను ఎంతో ఆలోచింపచేసింది. మీరు చేసిన ఆ చిన్నపని మీ మనస్తత్వాన్ని చెప్పింది. మా నాన్నకి అమెరికా అల్లుడు కావాలి. నాకు అచ్చతెలుగు అబ్బాయి, మంచితనం, మానవత్వం ఉన్న అబ్బాయి, మంచి టేస్టూ, భావుకత్వం ఉన్న అబ్బాయి భర్తగా కావాలి. మూడు నెలల క్రితం నాకు ఏక్సిడెంటై కాలు విరిగింది. ఇంట్లో ఖాళీగా ఉన్న నాకు- ఎందుకో... మీకు ఫోన్ చేయాలన్న చిలిపి ఆలోచన వచ్చింది. బహుశా... అప్పుడే టీవీలో నేను చూసిన ఓ తెలుగు సినిమా ప్రభావం నాపై పడివుండొచ్చు. మీతో మాట్లాడేకొద్దీ ఇంకా ఇంకా మాట్లాడాలనిపించేది. రోజూ మీరు ఆఫీసుకి వెళ్లేటప్పుడు, తిరిగివచ్చేటప్పుడు మిమ్మల్ని చూసేదాన్ని. ఎలా అంటే... మీరు వాడే లిఫ్ట్‌కి ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లోనే మేము ఉంటున్నాం కాబట్టి!

ఆరోజు డిన్నర్‌లో నేను మా కారులో కూర్చునే డిన్నర్ తిన్నాను. నా కాలికున్న బ్యాండేజ్ వల్ల కారు దిగలేదు. డిన్నర్ తీసుకుంటూ, మిమ్మల్ని చూస్తూ కూర్చున్నాను. మీ నవల నా స్నేహితురాలి సహాయంతో తెచ్చుకొని చదివాను. నాకు మాట ఇచ్చిన ప్రకారం నన్ను చూడటానికి మీరు ప్రయత్నించలేదు. మీలోని నిజాయితీ నాకెంతో నచ్చింది. ఇక ఇన్నిరోజులూ మీకు ఫోన్ చేయకపోవడానికి కారణం... 'నేను మిమ్మల్ని నిజంగా ప్రేమిస్తున్నానా?' అని నన్ను నేను పరీక్షించుకోవడం కోసం! నేను మీతో మాట్లాడకుండా, మిమ్మల్ని చూడకుండా ఉండలేనని నాకర్థమైంది. మీ కోపం, అసహనం చూశాక మీరూ అదే పరిస్థితిలో ఉన్నారన్న విషయం కూడా అర్థమైంది."

వెయిటర్ ఐటమ్స్ సర్వ్ చేశాక స్వీట్ ఆర్డర్ చేసింది భావన.

"ఈరోజు పార్టీ నేనిస్తున్నాను. ఎందుకో చెప్పండి..?"

"నా నవలకు బహుమతి వచ్చినందుకు!"

"కరెక్ట్..! వచ్చే ఆదివారం మీరు పార్టీ ఇవ్వాలి... ఎందుకో చెప్పండి?"

"మీరు సివిల్ సర్వీసెస్ ఫైనల్ పాసయివుంటారు."

"యూ ఆర్ అబ్సల్యూట్‌లీ కరెక్ట్!"

"కంగ్రాట్స్..." అంటూ భావన చేయి పట్టుకొని ఊపేశాడు. అతని ఆనందాన్ని చూసి 'ఇతనికి ఈర్ష్య, ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ లేవు' అనుకొంది మనసులో.

"ఇన్ని సంతోషకరమైన విషయాల మధ్య ఓ విషాద వార్త కూడా ఉంది" అంది భావన మెల్లగా.

"ఏమిటది?" ఆత్రంగా అడిగాడు శరత్.

"నా కాలు విరిగాక సిటీలోని ఓ ప్రఖ్యాత అర్థోపెడీషియన్ దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకున్నాను. అయితే గతవారం చివరిసారి కట్టు కట్టించుకోవడానికి వెళ్లినప్పుడు ఏక్సిడెంట్‌లో కొద్దిగా వంకర తిరిగిన నా కాలు మామూలు స్థితికి రాదని చెప్పాడు. నా బాధ ఏమని చెప్పను? ఓ అవిటిదానిలా

మిగిలిపోతాననే బాధకన్నా మిమ్మల్ని డిసప్పాయింట్ చేస్తున్నానన్న బాధే నాలో ఎక్కువగా ఉండింది. అందుకే హడావుడిగా మీ జీవితంలో ప్రవేశించిన నేను నిశ్శబ్దంగా మీ జీవితంలోంచి తప్పుకోవాలనుకున్నాను. అందుకే మీకు ఫోన్ చెయ్యలేదు. అయితే నా మౌనం మిమ్మల్నెంత బాధిస్తుందో నాకు తెలుసు. అందుకే మీకు అసలు విషయం చెప్పి మన ప్రేమ భవిష్యత్తు మీ నిర్ణయానికే వదిలెయ్యడానికి నిశ్చయించుకొని ఈరోజు మీకు ఫోన్ చేశాను. ఈ అవిటిదాన్ని చేసుకోవాలా, వద్దా అని నిర్ణయించుకోవాల్సింది మీరే!"

– ఆ మాట అంటున్నప్పుడు ఆమె కనుకొలకుల నుండి కన్నీరు రావటం చూశాడు.

రెండు నిమిషాలు మౌనంగా ఉండి, తర్వాత–

"సారీ! నేను అవిటితనం లేని అమ్మాయినే చేసుకోవాలని అనుకుంటున్నాను" అన్నాడు.

ఆమె బాధగా కళ్ళు మూసుకుంది.

"మనసుకి ఏ అవిటితనమూ లేని భావనని..!"

ఆశ్చర్యంగా కళ్ళు తెరచి అతనివైపు చూసింది. అతని కళ్ళు నవ్వుతున్నాయి.

"ఇంకోసారి చెప్పండి..!" నమ్మలేనట్లు అడిగింది.

"ఎన్నిసార్లు చెప్పమన్నా చెబుతాను. నా దృష్టిలో ప్రేమించడం వేరు, పెళ్ళిచేసుకోవడం వేరు కాదు. ఒకర్ని ప్రేమించి మరొకర్ని పెళ్ళిచేసుకొనే మనస్తత్వం కాదు నాది. ఒకవేళ ఈ ఏక్సిడెంట్ మన పెళ్ళయ్యాకే అయివుంటే మిమ్మల్ని వదిలేసేవాణ్ణా? మీరు నన్నర్థం చేసుకుంది ఇంతేనా?"

"లేదు. నాకు మీ గురించి ఎంత తెలిసినా ఇది జీవిత సమస్య! మనం ఊహించుకున్నంత తేలికగా పరిష్కారాలు ఉండవని అనుకున్నాను. మీరు మనస్పూర్తిగా నన్ను స్వీకరిస్తారా?"

"అవును."

"థాంక్యూ..!" అంటూ అతని చేతిని తీసుకొని అరచేయిని మెత్తగా స్పృశించింది. తర్వాత వాష్‌బేసిన్ దగ్గరికి వెళ్లి చేతులు వాష్ చేసుకొని వచ్చి కూర్చుంది.

"అదేమిటీ..: మీ కాలు?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.

"చక్కగా ఉంది. ఏక్సిడెంట్ అయిన మాట నిజం... కాలు వంకర తిరిగిన మాట అబద్ధం! నేను పెట్టిన చివరి పరీక్షలో కూడా మీరే నెగ్గారు. తెలివితేటలు, అందం, భావుకత లాంటి ఎన్నో విషయాల్లో మీరు నాకు సమవుజ్జీగా ఉన్నా మానవత్వంలో ఎన్నో మెట్లు పైన ఉన్నారు మీరు. ఇంకో విషయం... ఇన్నాళ్లూ అన్ని పరీక్షలూ నేనే పెట్టాను. కాని, కాబోయే జీవిత భాగస్వామి గురించి ఆడదానికంటే మగవాడికే ఎక్కువగా ఆశలు, ఊహలు ఉంటాయని చదివాను. మీరు పెట్టే పరీక్షలకు నేను సిద్ధమే! నేను మీకు అన్నివిధాలా నచ్చితేనే మన పెళ్ళి జరుగుతుంది" అంది భావన.

"పరీక్షలు అవసరం లేదు... మనిద్దరి ఆలోచనలూ, భావాలూ ఒకటే! కాబట్టి మీరు నచ్చకపోవడం అన్న ప్రశ్నే లేదు."

"మిమ్మల్ని పరీక్షించానని నామీద కోపం లేదుగా?!" భావన అడిగింది.

'మీపైన కోపం రాదు నాకు. ఎందుకంటే నా హృదయంలో మధురమైన 'భావన' మీరు."